క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం


వేపాడలో పసుపు అలంకరణలో దర్శనమిస్తున్న కళ్యాణ వేంకటేశ్వర స్వామి

వేపాడ: మండల కేంద్రంలోని శ్రీదేవీ భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్నపన తిరుమంజన సేవను వైభవంగా జరిపారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్ఛారణాలతో స్వామివారికి పూజలు జరిపారు. పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నువ్వుతో నవధాన్యాల సాగు లాభదాయకం


ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు వివరిస్తున్న శిక్షకురాలు సన్యాసమ్మ

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నువ్వు పంటతో పాటు నవధాన్యాలు సాగుచేయడం రైతుకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం శిక్షకురాలు సన్యాసమ్మ అన్నారు. చామలాపల్లి పంచాయతీ పోతుబంది పాలెంలో రైతులకు నువ్వుపంటతో పాటు నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు, లింగంపేట గ్రామాల్లోని మహిళా రైతులకు నవధాన్యాల కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఖరీఫ్ పంటల సాగుకు ముందు వీటిని నేలలో వేసుకుని 45 రోజుల తర్వాత ఆ మొక్కలను నేలలో కలియదున్నితే నేల సారవంతమై పంటలు బాగా పండుతాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.లక్ష్మి, బి.జానకి తెలిపారు. ఒక్కో కిట్‌ను రూ.100కు అందజేసినట్లు తెలిపారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన

కొత్తవలస: జల్‌జీవన్ మిషన్ పథంలో భాగంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రూ. 90 కోట్ల వ్యయంతో నిర్వహించిన తాగునీటి సరఫరా పనులను కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఎస్.ఆర్. గంగూలి ఆధ్వర్యంలో కొత్తవలస మండలంలోని చింతలపాలెం, దెందేరు, లక్కవరపుకోట మండలంలోని భీమాళి, చందులూరు గ్రామాల్లో పర్యటించారు. జల్‌జీవన్ మిషన్ పనుల తీరు, తాగునీటి సరఫరాను ఆయా గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇ.కవిత, ప్రాజెక్టు డీఈ వై.గోవిందరావు, ఎల్.కోట సబ్ డివిజన్ డీఈ పైడిరాజు, పలు మండలాల జేఈలు పాల్గొన్నారు.

రైల్వే గేటును ఢీకొట్టిన వారికి శిక్ష తప్పదు


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

గజపతినగరం: రైల్వే గేటు పడుతున్న సమయంలో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, రైలు వచ్చిన సమయంలో గేటును ఢీకొట్టిన వారికి శిక్ష తప్పదని బొబ్బిలి డివిజన్ రైల్వే పోలీసులు హెచ్చరించారు. గజపతినగరం మండల కేంద్రం పురిటి పెంట రైల్వే గేటు వద్ద వాహన చోదకులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రైలువచ్చే సమయంలో ప్రయాణానికి సిద్ధం కావడం ప్రమాదకరమన్నారు. నిర్లక్ష్యంగా డ్రైవ్‌చేసి గేటును ఢీకొట్టడం వల్ల రైల్వే సిగ్నల్ వ్యవస్థ దెబ్బతిని పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గేటు వేసిన తర్వాత తీసిన వరకు ఓపికగా ఉండాలని, ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని హితవుపలికారు.

పైడితల్లి చండీయాగం



కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. అమ్మవారి యాగ ప్రక్రియను భక్తులకు వివరించారు. ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

\- విజయనగరం టౌన్

అద్దె భవనాల్లోనే.. ఏళ్లతరబడి!

- అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- గంట్యాడ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 166 కేంద్రాలు
- వీటిలో 35 కేంద్రాలూ పరాయిపంచనే..
- కనీస వసతుల్లేక చిన్నారుల అవస్థలు


కొర్లాంలో అద్దె భవనంలోని ఇరుకైన గదిలో పిల్లలకు చదువు చెబుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

గంట్యాడ: ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు(ప్రీ స్కూళ్లు) నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడ ఉండే అరకొర సదుపాయాలతోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి. అటు అంగన్‌వాడీ సిబ్బంది, ఇటు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సొంత భవనాలు ఉండి ఉంటే అందులోనే పక్కా వసతులు ఉంటాయని, అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరేందుకు వీలుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ శిథిల భవనాలు, అద్దె భవనాల్లోనే వాటిని నిర్వహిస్తున్నారు. వాటిల్లో కనీసం మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. మరికొన్ని భవనాల్లో అయితే విద్యుత్ సౌకర్యం లేదు. ఇరుకైన గదులు, గాలి, వెలుతురు రానిచోట పిల్లలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఇదంతా చూస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు ఇంకెన్నాళ్లు పరాయిపంచన కేంద్రాలు నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. త్వరితగతిన కొత్త భవనాలు నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మొత్తం 166 కేంద్రాలు..

గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బొండపల్లి, గంట్యాడ మండలాలు ఉండగా, వాటిల్లో మొత్తం 166 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గంట్యాడ మండలంలో 96, బొండపల్లి మండలంలో 70 కేంద్రాలు ఉండగా వీటిలోని 35 కేంద్రాలు ఇంకా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఇవి పరాయిపంచనే నడుస్తుండడంతో అద్దెభారం ఎక్కువవుతోందని, అవే అద్దెలతో సొంత భవనం నిర్మిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నెలకు రూ.వేలల్లో అద్దె చెల్లింపు..

సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండం వల్ల నెలకు రూ.వేలల్లో అద్దె చెల్లించాల్సి వస్తోంది. గంట్యాడ ఐసీడీఎస్ పరిధిలో అద్దె భవనాల్లో ఉంటున్న మొత్తం 35 కేంద్రాలకు సంబంధించి, నెలకు రూ.45 వేల నుంచి రూ.50 వేలు వరకు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఏడాదికి రూ.5.40 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నారు. అదే ఏడాది అద్దె సొమ్ముతో సొంత భవనం నిర్మిస్తే ఈ అద్దె భారం ఉండదు కదా అని అంతా అంటున్నారు.

నిర్మాణ దశలో కొన్ని ఉన్నాయి..

గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 15 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటి నిర్మాణం పూర్తవ్వగానే అద్దె భవనాల్లోని కేంద్రాలను వాటిల్లోకి తరలిస్తాం. వీలైనంత వరకు సదుపాయాలు మెరుగపరిచేందుకు కృషి చేస్తున్నాం.

–డి.ఉమాభారతి, ఐసీడీఎస్ పీవో, గంట్యాడ

అగ్నిప్రమాదాలపై అవగాహన


ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫైర్ ఆఫీసర్ రామ్‌ప్రకాష్

కొత్తవలస: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలోని శారద మెటల్స్ అండ్ ఎల్లోయిస్ కంపెనీ వద్ద అగ్నిప్రమాదాలు–వాటి నివారణ చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యుత్, అగ్ని, ఆయిల్ ప్రమాద ఘటనల్లో ఏ విధంగా సురక్షితంగా ప్రాణాలు కాపాడుకోవాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ బీవీఎస్ రామ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో ఆందోళన చెందకుండా ప్రమాదాల నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలన్నారు. ప్రమాదాల నివారణ చర్యలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి వై.అశోక్‌కుమార్, కర్మాగారం ప్రతినిధులు ప్రభాత్ మోహన్, సన్యాసిరావు, పద్మాకరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్

అప్రమత్తతే ప్రధానం


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఓ రవిప్రసాద్

గజపతినగరం: గ్యాస్ గొడౌన్ వద్ద పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి ఎమ్.ఎస్.వి.రవిప్రసాద్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గజపతినగరం మండల కేంద్రం పురిటిపెంట వీఎస్సార్ హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. గ్యాస్ సిలిండర్లు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గజపతినగరం సాయిసిద్ధార్థ కళాశాల సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఎస్సార్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి సారికి బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

- ఈ వ్యర్థాలతో అనర్థాలెన్నో..
- నేడు స్వచ్ఛాంధ్ర
- స్వర్ణాంధ్రలో భాగంగా నిరుపయోగ వస్తువుల సేకరణ
- నగరంలోని కోట జంక్షన్, కార్పొరేషన్ జంక్షన్‌లలో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ

ఉంచుకుంటే.. పెను ముప్పే..!


పేరుకు పోయిన ఈ వేస్ట్

విజయనగరం: ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ప్రతి ఇంట్లో ఇతర వ్యర్థాల కన్నా ఎలక్ట్రానిక్ వ్యర్థాలే అధికంగా పేరుకుపోతున్నాయి. అందులో ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు ఉంటున్నాయి. ఆ పరికరాల్లో వినియోగించే చిప్‌లు, సెమీ కండక్టర్లు పర్యావరణానికి హాని చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. వీటిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని పేర్కొంటున్నారు.

పునర్వినియోగంతోనే మేలు

ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం 2019లో 50 మిలియన్ టన్నులకు పైగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పోగయ్యాయి. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3 లక్షలకు పైగా జనాభా ఉంది. 70వేలకు పైగా అపార్ట్‌మెంట్‌లు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఈ కాలంలో ఒక్కో ఇంట్లో సరాసరి మూడేసి సెల్‌ఫోన్‌లు వ్యర్థాలుగా పేరుకుపోయాయి. పాత కంప్యూటర్ డెస్క్‌టాప్‌ల స్థానంలో కొత్తవి రాగానే వాటిని కట్టి అటకెక్కిస్తున్నారు. ఇలా వేల కుటుంబాల్లో రెండు కంప్యూటర్లు, రెండు సీపీయూలు పేరుకుపోయాయి. కీ బోర్డులు, మౌస్లు వంటి పరికరాలు నిరుపయోగంగా మారి ఇళ్లలోని ఫర్నిచర్ల మధ్య ఉంటున్నాయి. పునర్వినియోగం చేస్తేనే పర్యావరణ హితానికి ఆస్కారం.

భూతాపం పెరుగుదలలో పాత్ర

ఇళ్లలో పేరుకుపోయే తడి, పొడి చెత్తతో పోలిస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మరింతగా హాని చేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ప్లాటినమ్, బంగారం, వెండి వంటి విలువైన లోహాలతో పాటు సీసం, తగరం, పాదరసం, ఆర్సెనిక్, కాడ్మియం, లిథియం, బేరియం వంటి భార లోహాలు కూడా ఉంటాయి. భార లోహాలు నేలకి చేరుకుంటే భూసారం క్షీణిస్తుంది. జలాశయాల్లోకి చేరితే తాగునీటి కాలుష్యం ఏర్పడుతుంది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వాడే పదార్థాలు చెత్త కుప్పలోకి చేరినప్పుడు అనుకోకుండా మంట తగిలి వ్యర్థాలు దహనమవుతున్నాయి. దీంతో వాయు కాలుష్యం ఏర్పడుతోంది. తద్వారా ఆ వాయువులు పీల్చినప్పుడు అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి. వీటి ద్వారా తలనొప్పి, శ్వాసకోశ వ్యాధులు, ఛాతినొప్పి, మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక రుగ్మతలకు లోనయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నేడు నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు :

స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు పైడితల్లి అమ్మవారి దేవస్థానం నుంచి కోట వరకు స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్కూల్ మరియు కళాశాల విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈసారి ఈ వేస్ట్ సేకరణే ప్రధాన ధ్యేయంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఖాళీ చేతులతో రాకుండా నిరుపయోగమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులను తప్పనిసరిగా తీసుకురావాలని చెప్పారు. లేని పక్షంలో తమ సచివాలయ పరిధిలో ఉన్న శానిటరీ కార్యదర్శులకు అందజేయవచ్చునని చెప్పారు. విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా, కోట జంక్షన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ సేకరణా కేంద్రాలలో నిరుపయోగమైన ఈ వేస్ట్ వస్తువులను అందజేయవచ్చునని తెలిపారు.

ఈ – వ్యర్థాల సేకరణకు చర్యలు

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపుపై అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయిన వీటి వల్ల పర్యావరణపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇవి భారీగా పేరుకు పోతున్నాయి. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న శనివారం ఈ –వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ – వ్యర్థాల్లో భాగంగా బ్లాక్ అండ్ వైట్ టీవీలు, పనిచేయని డెస్క్ టాప్ కంప్యూటర్లు, కీబోర్డులు, మౌస్లు, మానిటర్లు, మూగబోయిన ఫోన్లు, ఛార్జర్లు, పాతకాలం ఏసీలు, రేడియోలు తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులను సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు అందజేసేలా కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం కార్పొరేషన్ కార్యాలయం, కోట జంక్షన్ ప్రాంగణాల్లో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయగా... సచివాలయాల్లో , పారిశుధ్య కార్మికులు ఈ – వ్యర్థాలను సేకరించనున్నారు. అవసరమైన వాటిని ఉత్పాదక, పునర్వినియోగం, పునరుత్పాదక రంగాలకు తరలిస్తారు.

క్రీస్తు ప్రాణత్యాగం..మానవాళికి నిత్యజీవం!


వేపాడ: వల్లంపూడి-వేపాడ జంట గ్రామాల్లో శిలువ వేయబడిన క్రీస్తు విగ్రహంతో ఊరేగుతున్న క్రైస్తవులు


కొత్తవలస: కొత్తవలస జంక్షన్‌లో ఏసుక్రీస్తు శిలువ మోసే ఘట్టాన్ని రిక్రియేషన్ చేసిన దృశ్యం


దత్తిరాజేరు: పెదమానాపురం చర్చిలో ఏసుక్రీస్తుకు శిలువ వేయడాన్ని ప్రదర్శిస్తున్న మతవిశ్వాసులు

వాడవాడలా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. జీసస్ శిలువ మరణం పొందిన రోజును పురస్కరించుకుని, ఏటా ఈ కార్యక్రమం చేపడతారు. ప్రజల పాప పరిహారానికి ఏసుప్రభువు శిలువపై తనను తాను త్యాగం చేసుకున్నారని, ఆయన ప్రాణత్యాగమే సర్వమానవాళికి నిత్యజీవం ప్రసాదించిందని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసం ఆచరిస్తూ క్రీస్తు మరణం, శ్రమదినాలలో ఆయన పడిన ఇబ్బందులు గుర్తు చేసుకుని, ప్రత్యేక ఆరాధనలు చేశారు. దేవుడెన్నడూ బలిని కోరుకోడని, తనకు తానుగా ప్రజల కోసం బలి ఇచ్చుకున్నవాడే నిజమైన దేవుడని, ఆయనే ఏసుక్రీస్తు అని ఫాదర్‌లు తెలిపారు. ఇరుగుపొరుగు వారిని ప్రేమించి, వారి తప్పులను మంచి మనసుతో క్షమించాలన్న జీసస్ బోధనలను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఏసుప్రభువు మరణ వృత్తాంతం తెలిపే నాటక ప్రదర్శనలు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించాయి.

–గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నెట్‌వర్క్


మెరకముడిదాం: ఏసుప్రభువు మరణ వృత్తాంత ఘటనను తెలిపే నాటక ప్రదర్శనకు సిద్ధమైన క్రైస్తవులు


చీపురుపల్లి(గరివిడి): గరివిడి బాప్టిస్ట్ చర్చిలో క్రీస్తు సందేశం చదివి వినిపిస్తున్న పాస్టర్ జాన్‌బాబు


గజపతినగరం బాప్టిస్ట్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో మతవిశ్వాసులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎన్జీవో ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ

కొత్తవలస: ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేగల వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయంలో యూనిట్ అధ్యక్షుడు జేవీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. వైద్యారోగ్య శాఖలో వివిధ కేటగిరీ ఉద్యోగుల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను రద్దు చేయాలని కోరారు. సీనియర్ ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఖాళీలు భర్తీ చేయాలన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల జీతాల్లో వ్యత్యాసాలు సరిచేయాలన్నారు. ఐసీడీఎస్ ఉద్యోగులకు ఎఫ్‌టీఏ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీను, కృష్ణారావు, సత్యారావు, స్వర్ణలత, భాగ్యలక్ష్మి, వెంకరటణ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠోత్సవం

దత్తిరాజేరు: మండలంలోని మర్రి గ్రామంలో కొత్తగా నిర్మించిన దుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠోత్సవం ఈ నెల 29, 30, మే నెల 1వ తేదీల్లో నిర్వహిస్తామని కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే నెల 1వ తేదీన భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రమణయ్య ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.